# బోనాలు

బోనాలు అమ్మవారికి భక్తితో చేసే ఉత్సవం. "బోనాలు" అను పదం "భోజనాలు' ' నుండి వచ్చింది. అమ్మవారి పండుగప్పడు స్త్రీలందరూ అన్నం నైవేద్యంగా పెడతారు గాన "భోజనాలు". ఆ పదం నుండి "బోనాలు" వచ్చింది. అమ్మవారికి నైవేద్యంగా పెట్టిన అన్నాన్నే అన్ని కుటుంబాలవారు ప్రసాదంగా భక్తి భావంతో తీసుకొనెదరు. జంటనగరాలైన హైదరాబాదు, సికిందరాబాదులలో బోనాలు పండుగను భక్తిభావాలుతో చాలాబాగా ప్రజలు జరుపుకొంటారు. శ్రీ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారు మైసమ్మ, పోచమ్మ, కట్ట మైసమ్మ మొదలైన దేవతలను భక్తిభావంతో పూజిస్తారు. మొక్కుకున్న కోర్కెలు తీరిన తర్వాత అమ్మవారికి భక్తిభావంతో అమ్మవారి మూర్తిని ఊరేగిస్తూ నృత్యం చేస్తూ గుడికి తీసుకొనివస్తారు. ఆ విధంగా బోనాలు ఊరేగింపుతో కూడిన నృత్యంగా ప్రసిద్ధి పొందింది.



అమ్మవారి మూర్తి అయిన ఘటాన్ని నెత్తినపెట్టుకొని పూజారి ఊరేగింపుగా డప్పు వాద్యాలతో ఇంటి ఇంటి దగ్గర ఆగుతాడు. ఆ ఇంటివారు పూజారిపాదాలను నీళ్లతో కడిగెదరు. ఘటం మోస్తున్న పూజారి వెనకాల అమ్మవారి తమ్ముడుగా చెప్పబడుతున్న పోతురాజు కూడా ఉంటాడు. పోతురాజు తన ప్రత్యేక నృత్యంతో భక్తులను ఉత్సాహపరుచును. పోతురాజును గ్రామమును రక్షించువానిగా చెప్పదురు. మగవారందరూ నృత్యము చేయుచుండగా ఆడువారు అలంకరించబడిన పాత్రలను నెత్తిన పెట్టుకొని నడుస్తారు. పోతురాజు వేషధారి మంచికండ పుష్టికలిగి పసుపు రంగు ధోవతీ ధరించి, పసుపు రంగు గుడ్డను నడుముకు చుట్టుకొంటాడు. ఆ విధంగా వాద్యాల మధ్య ఊరేగింపు సాగుచుండగా నృత్యం చేస్తూ కొందరు భక్తులకు పూనకము వచ్చి ఆ పూనకంలో ప్రజల భవిష్యత్తు చెబుతారు.

ఈ విధంగా యువకులు, వృద్ధులు అందరూ 7 రోజులు పండుగ చేసుకొంటారు. ఈ పండుగలో చేయు నృత్యాలు ప్రజలలో ఉత్సాహం మరియు భక్తి భావం పెంచుటకు ఎంతో ఉపయోగపడతాయి.